# ఫూల్ చంద్ ఔదార్యం....

రచన:
చదరం సూర్యారావు

లక్షలమీద వ్యాపారం మూలాన్ని ఖర్చుకు లెక్కచేయకుండా పట్టభద్రుడైన ప్రభాకరును తన వ్యాపార వ్యవహారాలకు మేనేజరుగా వుంచాడు సేట్‌ఫూల్‌చంద్. ఫూల్‌చంద్ వ్యాపారం ఒక్కటిగాదు. మోటారు కంపెనీ, సైకిలుషాపు, కిరాణాషేన్సీ, రేడియో డీలింగు, క్లాత్‌షాపు, ఎక్స్‌పోర్టింగ్, ఇంపోర్టింగ్, వడ్డీవ్యాపారంతోసహా నడుస్తున్నాయి. ఇన్నిరకాల వ్యాపారాలైనా జంకులేకుండా చాకచక్యంగా వ్యాపారచక్రాన్ని వడిగా నడిపిస్తున్నాడు ప్రభాకర్. ఫూల్‌చంద్ అప్పుడప్పుడూ ప్రభాకర్‌తో అంటూండేవాడు "మిమ్ము నమ్మే నా ధనాన్నంతా తృణప్రాయంగా యీ వ్యాపారాలలో వెదజల్లుతున్నా! భారం, బాధ్యతా అంతా మీదే" అని.

ప్రభాకర్ వ్యాపారంలో నవీన పద్ధతుల నవలంబించి, హెచ్చులాభాలను చూపిస్తూ, గొడాములకు గవర్నమెంటువారి తాళాలు పడకుండా, ఇన్‌కమ్‌టేక్సు, సేల్సుటేక్సు వాళ్లనుండి నోటీసులు రాకుండా, ఎకౌంట్లలో యెప్పుడూ తేడా లేకుండా చూచుకుంటున్నాడు. ఇంకేంకావాలి ఫూల్‌చంద్‌కు?

ఫూల్‌చంద్‌కు కొడుకులు లేరు. ఒక్కర్తే ఆడపిల్ల. ఆమెపేరు కమల. వయస్సు 11 సం॥లు. ఉన్నతపాఠశాలలో చదువుకుంటుంది. ఆమె ప్రతీరోజు ఏదో విరామ సమయంలో ప్రభాకర్‌ను చంపుకుతినేది అర్థంకాని ఇంగ్లీషుపాఠములు చెప్పమనో లేక బోధపడని లెక్కలను బోధించమనో. విసుగులేకుండా అడిగింది చెప్పి ఆమెను సాగనంపేవాడు ప్రభాకర్. స్కూలుజీతము, పుస్తకాలు మున్నగు ఖర్చులకు అవసరమైనప్పుడల్లా వలసినంత ధనం ప్రభాకర్‌నుండే తీసుకుండేదితప్ప తండ్రి నడిగేదికాదు. ప్రభాకర్‌కూడా ఖర్చుకు కారణాలు అడగకుండా ఆమె అడిగినప్పుడల్లా ఖర్చు వ్రాసి కావలసినంత సొమ్ము యిస్తుండేవాడు.

రోజులు గడిచేకొలదీ కమల భౌతికశరీరంలో మార్పు హెచ్చింది. ఆమెకూడా ఇప్పుడు వయసువచ్చిన ఒక ఆడదని అనిపించుకుంటోంది గాని ఆమెలోని చిలిపితనం నశించలేదు. లోకులు కాకులనికూడా లెక్కచేయకుండా చనువుగా తిరుగుతుండేది ప్రభాకర్‌తో. ఇదిచూచి అప్పుడప్పుడు కమల తల్లి భర్తతో అంటుండేది "ఏమండీ! కమల్ని కాస్త కూకవేయక్కర్లే? ఆ మేనేజరుతో అంత చనువుగా ఉంటుంటే చూస్తూ ఊరుకుంటారేం? ఎదుటి వాళ్ళేమనుకుంటారేమో నని దానికి భయంలేదు, మీకు లెక్కలేదు...." దానికి జవాబుగా "నీవు ఇంకా ప్రాతరాతియుగంలోనే వున్నావు. అది చదువుకుంటున్నపిల్ల. ఆడ మగా వివక్షతలేకుండా అందరితో అలా చనువుగా తిరుగుద్ది, అది తప్పా? అందులోనూ మన మేనేజరు చాల మంచి కుర్రవాడు. మనమంటే గౌరవభక్తులు మెండు. మన కమల ప్రొప్రైటరు హోదాలో తిరుగుతుంది. వాళ్ళూ ఆ తారతమ్యంతో గౌరవిస్తారు, దీనిలో తప్పేముంది?" అన్నాడు ఫూల్‌చంద్ సగర్వంగా హుక్కాపీలుస్తూ.

*　　*　　*

నాడు ఆదివారం కమలకు శెలవురోజు. వయస్సువచ్చిన ఆడపిల్లని వెంటవేసుకుని త్రిప్పుట మంచిదికాదని ఇంట్లోవుంచి ఆమె తల్లిదండ్రులు విందుకు వెళ్లేరు. సుమారు సాయంత్రం మూడు గంటలైంది. ఆకాశాన్ని కారుమేఘాలుకప్పేయి. వర్షపు ఉనికి పండిన పంటవలె ఎప్పుడు పడునో చెప్పలేము. ఇంతలో ప్రభాకర్ కంగారుగా వచ్చాడు ఫూల్‌చంద్‌యింటికి తమ వ్యాపారం తాలూకు చీకటిలో వ్రాసుకోవలసిన జమా ఖర్చుల పట్టీలు తయారుచేసుకునేందుకు. ఇలాంటి పట్టీలు ఆదివారాలలో ఫూల్‌చంద్ ఇంటిలో గూఢంగా ఫూల్‌చంద్, ప్రభాకర్లు మాత్రమే కూర్చొని తయారుచేసుకొనుట వారికి పరిపాటి. ఆ అలవాటుపై ప్రభాకర్ వచ్చాడు గాని ఫూల్‌చంద్ సతీసమేతుడై విందుకు వెళ్ళేడని ప్రభాకర్‌క తెలియదు.

"సేట్ జీ!"

"..........."

"సేట్ జీ!"

"ఎవరు మీరు?" అంది తలుపుతీస్తూ కమల.

"నేను కమల! ప్రభాకర్‌ని"

"బయట్నించి పిలుస్తారేం? లోనికి రాకుండా!"

"నాన్నగారు లేరా?"

"మా అమ్మా-నాన్నా చుట్టాలింటికెళ్లేరు"

"నాన్నగారికోసం వచ్చాను. వారు లేకపోతే వెళ్ళిపోతా"

"లేకపోతే వెళ్లిపోతానంటారేమిటి? లేరనేగా చెపుతున్నా"

"నీ వేళాకోళం మానవు. వెళ్ళివస్తా!" అని ఓ చిరునవ్వు విసిరి వెనక్కి తిరగబోయాడు ప్రభాకర్.

"తప్పు! తప్పు! వెళ్లివచ్చేవాళ్లు వెళ్లకుండానే ఉండగూడదూ?"

"...................."

"లోపలకువచ్చి కూర్చోండి. రావడం మీ యిష్టంగాని మా యింటికివచ్చిన తరువాత మీరు వెళ్లడమనేది మా యిష్టం. 'టీ' రెడీగా వుంది తీసుకువస్తాను" అని చరాచరా లోనికి వెళ్లిపోయింది కమల.

"కమలా! నాకు టీవద్దు. ఇప్పుడే టీత్రాగి కిళ్లీవేసుకు బయలుదేరాను.........." అనే ప్రభాకర్‌మాటలు ఆమె చెవిలోనికి చొరబడలేదు. ప్రభాకరుకు అచ్చట కూర్చోవటం తప్పించిగాదు.

లోపలినుండి కమల రెండు టీలుతీసుకు వచ్చి టేబులుమీద వుంచింది. టేబులుకు ఒకవైపు కుర్చీపై ప్రభాకర్ రెండవవైపు కుర్చీపై కమల కూర్చున్నారు. ఆ ఇరువురి భౌతికదేహాలకు మధ్య టేబులుమాత్రముంది గాని కండ్లుమాత్రం స్వేచ్ఛగా చూచుకుంటున్నాయి ఒకరివైపు మరియొకరు. కొద్దిసేపు

మౌనంగా నడచింది. నాడు కమలలోని సౌందర్యాన్ని పూర్తిగా జంకులేకుండా చూచుకొని తన హృదయంలో చిత్రించుకున్నాడు ప్రభాకర్. నాటివరకూ ప్రభాకర్ దృష్టిలో కమల ఒక మొగ్గమాత్రమేగాని నేడు వికసించి తన ఆకర్షణపత్రములతో తుమ్మెదల నాహ్వానించే పుష్పంలావుంది. కమల మనసు ఏదో తప్పుచేసినట్లు గాబరాపడుతోంది. శరీరంలో విద్యుచ్ఛక్తి ప్రవహిస్తోంది. నాటివరకూ పురుషస్పర్శ ఎరుగని ఆమె దేహాన్ని ప్రభాకర్ ఉనికి ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. ఆ ఇరువురి గుండెలూ బరువెక్కిపోయాయి.

"కమలా! నీవు ఒంటిగా వున్నావు. ఎవరైనా చూస్తే ఏమనుకుంటారు? నే వెళ్లిపోతాను."

"ఒకళ్లు అనుకోవడంతో మనకు సంబంధము లేదు" అంది ముక్తసరిగా.

"నీవు చిన్నదానవు. ప్రపంచపోకడలు అర్థంచేసుకోలేనిదానవు. ఇపుడు మనం ఇలా ఉండడం సంఘదృష్టిలో ఘోరాపచారం"

"మనదృష్టిలో తప్పుకానిపనులు ఇతరుల దృష్టిలో అపచారమైతే మనకేం? ఉపచారమైతే మనకేం?"

"నీ ఉద్దేశ్యం?"

"నీ హృదయంలో నాకు స్థానమివ్వాలి ప్రభాకర్!"

"ఎంత మాటలను పేలాడుతున్నావు కమలా!"

"ఏమైనాసరే! ఇది నా నిశ్చంచల నిశ్చయం ప్రభాకర్."

ప్రభాకర్ బుర్రలో తుఫాను రేకెత్తింది. అప్సరసలాంటికన్య ఆశిస్తున్నది. సంఘాన్ని యెదిరించే స్వభావంకలవాడైనా ఏ నిర్ణయానికీ వెంటనే రాలేకపోయాడు.

"మీఅమ్మా-నాన్నా ఏమంటారు కమలా?" అని ప్రశ్నించేడు.

"వాళ్లని బ్రతిమాలుకుంటాను. వింటే మహా సంతోషం. వినకపోతే నీ హృదయంలోనికి వలసవచ్చివేస్తా" అంది బరువెక్కిన హృదయంతో.

ప్రభాకర్‌బుర్ర ఆలోచనలతో పరుగెడుతోంది. ఎదురుగావున్న అప్సరస అందాన్ని త్రాగి కడుపునింపుకుంటున్నాయి వానికండ్లు. శరీరం కండ్లపై యీర్ష్యచెందింది. వెంటనే ధైర్యంచేసుకుంది. శరీరనాళాలలో ఉద్రేకం పొంగుకువచ్చింది, నిగ్రహించలేకపోయాడు. వెంటనే ఆమెను చేరదీశాడు. కమల వాని హృదయానికి హత్తుకుని ఒరిగింది.

నాటితో వారిరువురి మనస్సులు ఐక్యమైపోయాయి. ఒకరినిచూడకుండామరియొకరు ఉండలేరు.

*  *  *

"అమ్మా! నేను ఒకటి అడగనా?" అంది కమల వాళ్లతల్లిని అమాయకంగా ఒకరోజున.

"ఏమిటే? ఏమి కావాలో చెప్పు!"

"ఊహు! అడగను అడిగి నిరాశపొందేకంటే అడగకుండా కృంగిపోవుట మేలు"

"ఏమిటే నీ మాటలు? నా కర్థంకాలేదు విప్పిచెప్పు?"

"నీవేమీ అనవుగా?"

"అనను"

"మంజూరు అంటేనే చెపుతా!"

"ఏమిటో తెలియకుండా ఎలా మంజూరు చేస్తాను"

"పోనీగాని నాకు చిన్న అనుమానం వచ్చిందే అమ్మా. మనం ఉత్తరప్రదేశంవాళ్లం ఆంధ్రరాష్ట్రంలో ఉండిపోయాంగదా! మన చుట్టరికములు ఆంధ్రులతోనే గదటే."

"ఏడ్చేవు. చదవేస్తే ఉన్నమతీ పోయిందన్నట్లుంది నీ వరస. మనం వ్యాపారానికని యిచ్చటకు వచ్చాం. ఎన్ని సంవత్సరాలు ఇచ్చటవున్నా మనకు మనరాష్ట్రం, ఊరు, కులం, ఆచారం శాశ్వతముగాని ఈరాష్ట్రం వాళ్లతో ఎలా సంబంధం వుంటుంది?"

"ఊపిరాడక ఉక్కిరి బిక్కిరి లాడుతూ గుడ్లెళ్లబెట్టి ముచ్చెమటలు గ్రక్కింది ఆమాట విని కమల. ప్రక్కనున్న గ్లాసులోని నీళ్లు త్రాగేసింది.

"ఈసమస్య నీకెందుకువచ్చిందే అమ్మి?"

"ఊరికేనే అడిగేనమ్మా" అంది కమల.

*  *  *

కమల ప్రశ్నకు ఏదో అంతరార్థం వుందని గమనించింది ఆమెతల్లి. కమలతండ్రి ఇంటికి వచ్చాడు. కమల కాలేజీకి వెళ్లిపోయింది.

"ఏమండోయ్! విన్నారా కమల అనుమానం? మన సంబంధాలు ఈ రాష్ట్రం వాళ్లతోనే ఉంటాయా" అని అడిగింది.

"దానికి తెలియక అడిగింది. దానిలో తప్పేమిటి?"

"మీరు ఇంకా నిద్రలోనే వున్నారు. ఏదో అంతరార్థం లేకుండా ఎప్పుడూలేని ప్రశ్న ఇప్పుడెలా వస్తుందండి? నాకు ఏదో అనుమానంతోకూడిన భయం వుంది. ఆకాలేజీలో ఎవరిమీద కన్నుపడిందో ఏమిటో! మనకు చదువువద్దూ ఏమీ వద్దు. కాలేజీ మానిపించి వెంటనే పెండ్లి యేర్పాటుచేయండి, కాకపోతే అపకీర్తిపాలు. పదిమందిచేత నవ్వించుకుంటాం.

"అయితే కమలని అడిగి ఆలోచిస్తా!"

"దాన్నడగడ మేమిటండి? ఎద్దునడిగి గంతలుకడతారా? దానికిష్టంవచ్చిన మగడ్ని తెచ్చియిస్తారా? మంచి సంబంధము చూచి వీలైతే ఇల్లరికం ఎచ్చేవాణ్ణి చూచి పెండ్లి చేయాలి" అంటూవుండగానే కమల కూడా కాలేజీనుంచి వచ్చింది.

"అదిగో! వచ్చింది దాన్ని పిలచి మాట్లాడండి" అంటూ లోనికి వెళ్లిపోయింది.

"అమ్మా! కమలా! ఇలారా" అని తండ్రి పిలిచాడు.

"వస్తున్నా నాన్నా!" అని కమల జవాబిచ్చి తనగదిలో పుస్తకములు విడచి చిరునగవుతో తండ్రిచెంతకు వచ్చింది.

"అమ్మా! మీపరీక్షలు వచ్చే మార్చినెలలో అయిపోతాయిగా!"

"అవును నాన్నా! మార్చి 25 వ తేదీ నాటికి ప్రాక్టికల్సుతో సహా అన్నీ అయిపోతాయి."

"ఇంకా చదువుతావా? మీ అమ్మ నీ పెండ్లికై తొందరపడ్తూంది, నీవు చదువుతానంటే అడ్డురాను. మానేస్తానంటే పెండ్లి యేర్పాట్లుచేస్తా."

సిగ్గుతో తలవంచి "మీ యిష్టం నాన్నా. చదువుకూ పెండ్లికీ సంబంధము ఏముంది" అంది చిరునగవుతో. ఈ జవాబులో ఆమె పెండ్లివైపే మొగ్గినట్లు కనిపించింది. దీనికి కారణమేమో వుంటుంది. ఆమెలో రేకెత్తిన తుఫాను ఏవిధంగా ముగిస్తుందో చూద్దామని ఆమె కుతూహలం. నాన్నకూడా అమ్మలానే జాతి, మతాలకు దోహదమిస్తాడో లేక నాకు స్వేచ్ఛనిచ్చి నా నిర్ణయాన్ని నెరవేరుస్తాడో చూడాలని ఆమె అభిలాష.

"ఢిల్లీప్రాంతాలల్లో నాల్గు మంచి సంబంధాలు ఉన్నట్టు మీ మేనమామ ఉత్తరం వ్రాశాడు. నేను వెళ్లిచూచి ఆ తరువాత నీ ఉద్దేశ్యం తుదినిర్ణయంగా చేస్తాను"

"అంతదూరమా నాన్నా? మీరు ఇచ్చట, నేను అచ్చటానా! నేనుండగలనా?" అని భయాన్ని వెలిబుచ్చింది.

"మరి ఎలా అమ్మా? స్త్రీకి పుట్టిల్లు నిత్యం కాదుగా. ఇల్లరికానికై ప్రయత్నిస్తాను ఆపైని మన అదృష్టం."

"ఈ ఊళ్లో సంబంధాలు పనికిరావా నాన్నా?" సిగ్గుతో తలవంచుకొంది.

ఈ మాటలతో కమలతల్లి చెప్పినమాటలు అతుకుకొని బోధపర్చుకున్నాడు పూల్ చంద్.

"ఈ ఊళ్లో మనకు తగినవాళ్ళు, అర్హులూ మన కులంవాళ్లూ రమ్మా!"

"కులం ఆచారం మనల్ని విడవవా నాన్నా? పోనీ వాటిని మనం ఎందుకు విడవకూడదూ?" అంది అమాయకంగా.

"వీటిని విడిచిపెడితే సంఘానికి దూరమైపోతామమ్మా!" అని జవాబు యిచ్చాడు పూల్ చంద్. పూల్ చంద్‌లో సంస్కరణ భావాలువున్నాయి. ప్రేమ పెండ్లిళ్లను మెచ్చుకుంటాడు. బలవంతపు పెండ్లిళ్లలో దాగివున్న ఘోరములు తెలుసు. అందుచే ఆలోచన్లో మునిగాడు. ఇరువురిమధ్యా కొద్దిసేపు మౌనం నెలకొంది. ఏదో నిశ్చయానికివచ్చి "అవును గాని నీకు నచ్చిన వరుడు ఇచ్చటెవరన్నా ఉన్నారా అమ్మా!"

"ఇంత మహాపట్టణంలో ఒక వరుడే ఉండడా? ఉన్నా ఏం ప్రయోజనం. మిమ్ములను కప్పివుంచిన ఈ కులమతతత్వ ఇనుప తెరలను భేధించేదెవరు?" అంది కొంచెం ధైర్యం తెచ్చుకుని.

"అయితే నీ కోర్కె యేమిటి? నీ పెండ్లి నీ యిష్టప్రకారం చేసుకుంటావా? లేక మా యిష్టప్రకారం చేసుకుంటావా? నాకు ఒక్కగాని ఒక కూతువు. నీవు సంతోషంగా సుఖముగా బ్రతకాలి అంతే" అన్నాడు తండ్రి.

"అయితే నా యిష్టం నెరవేరుస్తావా నాన్నా" అంది అరిపోతున్న ఆశలదీపాన్ని వెలిగించుకుంటూ.

"ఏమిటో చెప్పు ఆలోచిస్తా"

"మళ్లీ సందేహమే"

"ఏదో చెప్పరాదూ"

"మన మేనేజరు ప్ర..........."

"ప్రభాకర్ అంటే ఇష్టమన్నమాట?"

ఆ మాటలతో కమల తలవంచుకుంది సిగ్గుతో.

"అతడేమంటాడో?" అన్నాడు పూల్ చంద్.

"మీరు అడిగితే కాదనడు నాన్నా"

ఈ సంభాషణ విని కమలతల్లి చకితురాలయింది. తన మతం కులం సంఘం, బంధు జనం అందరికీ దూరమైపోతామనే బెంగతో. కాని పూల్ చందు సావధానంగా భార్యను తన యిష్టానికి ఒప్పించాడు.

*    *    *

ప్రభాకరును మామూలువేళకంటె ముందుగనే పిలిపించాడు పూల్ చంద్.

ప్రభాకరుకు అనుమానంవేసింది తనచర్య తెలిసిందేమోనని బెదురుతూనే వెళ్లాడు. వీనిరాకకై నిరీక్షిస్తున్న కమల పూలమొక్కల ఆకులచాటునుండి చూచింది. ఆమెలోపొంగే సంతోషతరంగాలు ఆమెచేతులచే ఓ గులాబీ పువ్వుకోయించి అతనిపై విసరించింది. ఆ సంభవంతో స్థిమితం చిక్కింది ప్రభాకర్‌కు.

పూల్ చంద్ కుర్చీలో కూర్చొని హుక్కా పీలుస్తున్నాడు. ప్రభాకర్ గుమ్మంలోనుండి గుండెబెదురుతో తిలకించాడు. పూల్ చందు చిన్న చిరునగవుతో స్వాగత మిస్తున్నట్లు చూచాడు. ప్రభాకర్‌గుండె కొంచెం స్థిమితపడింది.

"నమస్తే జీ!"

"నమస్తే! రండి ఈకుర్చీలో కూర్చొండి" అన్నాడు పూల్ చంద్.

ప్రభాకర్ ఎదురుగావున్న కుర్చీలో కూర్చున్నాడు.

"ప్రభాకర్! నిన్ను ఒక మహత్తరకార్యముపై పిలిపించాను. దీనిలో నీ ఆశయాలు ఉద్దేశ్యాలూ తెలుసుకుందామని."

"ఏమిటో సెలవివ్వండి?"

"మన కమలపై నీ ఉద్దేశ్యమేమిటి?"

"కమలా! బుద్ధికి బృహస్పతి, విద్యలకు సరస్వతి, కలిమికి లక్ష్మి, అందానికి అప్సరసా..........."

మాటలో అందుకొని "అదిగాదు అవన్నీ నాకు తెలుసు. నీవు యెవరినైనా ప్రేమిస్తున్నావా?"

నేనా!.......నాకు ప్రేమా లేదు — పెండ్లీ లేదు. ఆ సంగతి మీకు తెలుసుగా"

"కమలను నీకిచ్చి పెండ్లిచేయాలనుకుంటున్నా, నీ కిష్టమేనా?"

"కమలను నే పెండ్లిచేసుకొనుటా!"

"కమల నిన్ను ప్రేమించేసంటోంది. నీవు కూడా ఆమెను త్రికరణశుద్ధిగా ప్రేమిస్తే మీ ఇరువురకు పెండ్లిచేయుటలో నాకు అభ్యంతరము లేదు. ఆమె సంతోషంకోసం కులమత భేదాలను త్యజింపదలచితిని."

"మీకేనాడూ ఎ... రు చెప్పలేదుగా" అన్నాడు వినయంగా ప్రభాకర్. అతనిలోని సంతోషం, సిగ్గు వేయి కెరటాల్లా పొంగి వాని తలనుమాత్రం క్రిందికి దింపించాయి.

# నైరాశ్యగీతం

రచన: "పాంచాలి"

★

వెళ్ళిపోయే ప్రేయసీ! నా—
కళ్ళ బాసది మరచితే?

తలపులన్నీ ...కు నిలిపి
సెలవువీడీ నిలువలేవు
వలపుతలుపులు తీసిరెదలో
తెలియనట్టుల సాగిపోయెదే? ॥వెళ్ళి॥

వాలుచూపుల వలనువిసిరి
తేలిపొమ్మా! కలల నీటని
కాలిపోయే గుండెలో...
తైలమేదో! చిలుకరించి ॥వెళ్ళి॥

కరుణను...తయు చిలుకలేవు
మరణ వేదన మనసుకిచ్చి
దారిచూచుక నీవుసాగిన
ఆరిపోయే కోరికేమొ! ॥వెళ్ళి॥

మనసు నెరిగిన మగువ యనుకొని
మనసు నీపై నిలుపుకొంటిని
తెలియనట్టుల మెలగుచుంటివి
తలచితలచి కలతకంటిని ॥వెళ్ళి॥